కోఠిలోని డీపీహెచ్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న వైద్య ఉద్యోగులు

'వైద్య' బదిలీలు ఆగమాగం

- డీపీహెచ్ కార్యాలయం ముందు నర్సుల ఆందోళన
- సీనియార్టీ జాబితాలో తప్పులు దొర్లాయంటూ విమర్శలు
- అప్‌లోడ్ చేసిన వివరాలు తప్పుగా వచ్చాయన్న బాధితులు

హైదరాబాద్, జూలై 11 (నమస్తే తెలంగాణ): వైద్యశాఖలో బదిలీలు గందరగోళంగా తయారవుతున్నాయి. తమ గోడును అధికారులు వినకపోవడంతో ఉద్యోగులు గురువారం కోఠిలోని డీపీహెచ్ కార్యాలయాన్ని ముట్టడించారు. సీనియార్టీ జాబితాను అస్తవ్యస్తంగా రూపొందించారని, మార్చాలని ఎన్నిసార్లు అడిగినా పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఆ సమయంలో డీపీహెచ్ రవీంద్రనాయక్ అందుబాటులో లేకపోవడంతో గంటలపాటు అక్కడే నిరసన తెలిపారు. తాము అప్‌లోడ్ చేసిన వివరాలు మారిపోయాయని పలువురు అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేశారు. తప్పులు సరిచేయడానికి ఎడిట్ ఆప్షన్ కూడా లేదన్నారు. సీనియార్టీ తప్పుగా నమోదైందంటూ చాలా మంది ఆవేదన వ్యక్తం చేశారు. వైద్యారోగ్య శాఖలో బదిలీల్లో గందరగోళంపై టీటీజీడీఏ ఆగ్రహం వ్యక్తం చేసింది.

వైద్యసేవలపై నిఘాకు కమిటీలు: మంత్రి దామోదర రాజనర్సింహ

ప్రభుత్వ, ప్రైవేటు దవాఖానల్లో నాణ్యత, పారదర్శకత పెంచటానికి వేర్వేరుగా కమిటీలను నియమిస్తామని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. ప్రైవేట్ దవాఖానల ఆగడాలపై నిఘా కొనసాగుతుందన్నారు. గురువారం ఆయన సచివాలయంలో కార్పొరేట్ దవాఖానల యజమన్యాలతో మాట్లాడుతూ.. క్లినికల్ ఎస్టాబ్లిమ్మెంట్ యాక్ట్‌ను కఠినంగా అమలు చేస్తామని చెప్పారు. సామాజిక బాధ్యతగా ప్రభుత్వ దవాఖానలకు తమవంతు సహకారం అందించాలని కోరారు. ఆరోగ్యశ్రీ బకాయిలు త్వరగా విడుదల చేయాలని దవాఖానల యజమానులు, ప్రతినిధులు మంత్రికి విజ్ఞప్తి చేశారు.

సర్కారు దవాఖానల్లో గోలీల్లేవ్!

- సీఎంఎస్‌లలో నిండుకుంటున్న నిల్వలు
- ముసురుతున్న సీజనల్ వ్యాధులు
- ఖాళీ అయిన యాంటి బయాటిక్స్
- 'ఎసిడిటీ' ట్యాబ్లెట్లూ కరువే
- తీవ్ర సంక్షోభంలో ప్రజావైద్యం

హైదరాబాద్, జూలై 11 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో సర్కారు దవాఖానల పరిస్థితి రోజురోజుకూ దయనీయంగా మారుతున్నది. ఇప్పటికే అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న ప్రజావైద్యంపై 'మందుల కొరత' పిడుగులా మారింది. వైద్యారోగ్యశాఖ ఔషధాల కొనుగోలును పట్టించుకోకపోవటంతో క్రమంగా 'సెంట్రల్ మెడిసిన్ స్టోర్లు' (సీఎంఎస్)లు ఖాళీ అవుతున్నాయని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. జలుబు, దగ్గు, వాపు వంటి ప్రాథమిక వ్యాధులకు కూడా మందులు లేకపోవటం వైద్యారోగ్యశాఖ దీన స్థితికి అద్దం పడుతున్నది. సీఎంఎస్‌లు మందులను నిల్వచేసే గోదాములు. ఇక్కడి నుంచి వాటి పరిధిలోని దవాఖానలకు మందులు సరఫరా అవుతుంటాయి. రాష్ట్రంలోని 11 సీఎంఎస్‌లు వరంగల్, కరీంనగర్, ఖమ్మం, నల్లగొండ, హైదరాబాద్, మెదక్, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, సిద్దిపేట, ఆదిలాబాద్, నిజామాబాద్‌లో మందుల నిల్వలు తాజాగా పరిశీలించగా విస్తుపోయే అంశాలు వెల్లడయ్యాయి.

- సీపీఎం (Chlorpheniramine) ట్యాబ్లెట్లు సర్ది (జలుబు) చికిత్సకు వాడే సర్వసాధారణమైన ఔషధం. వర్షాకాలం వేళ వీటి వినియోగం ఎక్కువగా ఉంటుంది. కానీ రాష్ట్రంలోని సీఎంఎస్‌లలో ఎంత నిల్వ ఉన్నయో తెలుసా? '0' మాత్రమే. మొత్తం 11 సెంటర్లలో నిల్వలు నిండుకున్నాయి.
- పాంటోప్రజోల్ (Pantoprazole) – దీనిని ఎసిడిటీకి విరుగుడుగా వాడుతుంటారు. ఇవి ఆదిలాబాద్ సీఎంఎస్‌లో తప్ప రాష్ట్రంలోని మరే సెంటర్‌లోనూ లేకపోవడం గమనార్హం. ఇక పాంటోప్రజోల్ ఇంజెక్షన్లు ఎక్కడా కనిపించటంలేదు. అంతేకాదు.. ఆంటాసిడ్ (Antacid) సిరప్‌లు, సుక్రల్ఫేట్ (Sucralfate) సిరప్‌లదీ ఇదే పరిస్థితి. రాష్ట్రంలోని ఏ సీఎంఎస్‌లోనూ వీటి నిల్వలు లేకపోవటం బాధాకరం.
- అమాక్సిసిలిన్ + క్లావమ్ (Amoxicillin+Clavum) ఇంజెక్షన్లను ప్రాథమిక యాంటి బయాటిక్స్‌గా వాడుతుంటారు. సీజనల్ వ్యాధుల నేపథ్యంలో పెద్దఎత్తున అమాక్సిసిల్లిన్ ఇంజెక్షన్లు, సిరప్‌లు అందుబాటులో ఉండాలి. కానీ ప్రస్తుతం మెదక్ సీఎంఎస్‌లో 800 ఇంజెక్షన్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. సిరప్‌లు ఎక్కడాలేవు. నిల్వలు పూర్తిగా నిండుకున్నాయి.
- సెర్రాటియోపెప్టిడేజ్ (Serratiopeptidase) ను నొప్పి నివారణకు, వాపు రాకుండా వాడుతుంటారు. రాష్ట్రంలోని ఏ సీఎంఎస్‌లోనూ ఈ నిల్వలు లేవు.
- ఎవరి శరీరంలో అయినా ప్రమాదకర స్థాయిలో యాంటిబాడీల సంఖ్య తగ్గినప్పుడు ఇమ్యునోగ్లోబిన్ (Human Normal Immunoglobin) ఇంజెక్షన్లు ఇస్తుంటారు. ప్రస్తుతం ఇవి రాష్ట్రంలోని మూడు సీఎంఎస్‌లలో కలిపి 88 మాత్రమే అందుబాటులో ఉన్నాయి.
- పీసీఎం ఇన్‌ఫ్యూజన్ (PCM Infusion) ను నొప్పి నివారణ కోసం వినియోగిస్తారు. రాష్ట్రంలోని ఏ సీఎంఎస్‌లోనూ వీటి నిల్వ లేదు.
- చివరికి.. ఇన్సులిన్ ఇంజెక్షన్లు కూడా రెండు కేంద్రాల్లో 208 ఉన్నాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.
- కంటి చికిత్సలో వినియోగించే సిప్రో ఐ డ్రాప్స్, చెవుల చికిత్సలో పనిచేసే జెంట్రా ఇయర్ డ్రాప్స్ కూడా సీఎంఎస్‌లలో నిండుకున్నాయి.

సీజనల్ వ్యాధుల వేళ..

రాష్ట్రంలో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. ఇలాంటి సమయంలో మందులు నిల్వ ఉంచుకోవాల్సింది పోయి ఖాళీ కావడంపై ఆందోళన వ్యక్తం అవుతున్నది. రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్ బిల్లులు చెల్లించకపోవటంతో రెండు, మూడు నెలల కిందటే సప్లయర్లు మందుల సరఫరాను నిలిపివేశారు. అదేంటని అడిగితే.. కేంద్రం ఎన్‌హెచ్‌ఎం నిధులు మంజూరు చేయలేదని, అందుకే మందులు కొనటం లేదని వింత సమాధానం ఇచ్చింది. అయితే ప్రతి దవాఖానలో కచ్చితంగా మూడు నెలలకు సరిపడా మందులు ఉండాలని గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. ఈ మేరకు అన్ని దవాఖానల్లో మూడు నెలలకు సరిపడా నిల్వలు ఉంచుతున్నారు. ప్రస్తుతం దవాఖానల్లో వాటితోనే నెట్టుకొస్తున్నారు. మరికొన్ని రోజుల్లో దవాఖానల్లో నిల్వలు అయిపోతాయని చెప్తున్నారు. అటు సీఎంఎస్‌ల్లో మందులు లేక, ఇటు దవాఖానల్లో మందులు లేకపోతే ప్రజావైద్యం సంక్షోభంలో చిక్కుకుంటుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలని కోరారు.

రాష్ట్రంలో నిలిచిన రిజిస్ట్రేషన్లు

హైదరాబాద్, జూలై 11 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో గురువారం రిజిస్ట్రేషన్ సేవలు నిలిచిపోయాయి. దీంతో క్రయవిక్రయాల కోసం సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్‌లకు వచ్చినవారు తీవ్ర అవస్థలు పడ్డారు. ఆధార్ ఆన్‌లైన్ సేవల్లో (ఈ-కేవైసీ) అంతరాయం కారణంగా ఈ సమస్య తలెత్తినట్టు అధికారులు తెలిపారు. వాస్తవానికి మూడునాలుగు రోజులుగా అప్పుడప్పుడూ సమస్య ఎదురవుతున్నది. గురువారం పూర్తిగా నిలిచిపోయాయి. ఆధార్ నెట్‌వర్క్‌లో తలెత్తిన సాంకేతిక లోపాల వల్లే ఈ సమస్య తలెత్తిందని, ఓటీపీ సేవలు, రిజిస్ట్రేషన్స్ సేవలు నిలిచిపోయాయని ఆ శాఖ తెలిపింది. నిలిచిన రిజిస్ట్రేషన్లను శుక్రవారానికి బదిలీ చేశామని వెల్లడించింది.

ఎక్సైజ్‌శాఖపై మంత్రి జూపల్లి సమీక్ష

హైదరాబాద్, జూలై 11 (నమస్తే తెలంగాణ): రానున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు గురువారం అబ్కారీ భవనంలో సమీక్ష నిర్వహించారు. రాబడి, మద్యం కంపెనీలకు చెల్లించాల్సిన బకాయిలు, మద్యం స్టాక్ పై అధికారులతో మాట్లాడినట్టు తెలిసింది. బడ్జెట్‌లో ఎక్సైజ్ శాఖ వాటాపై, పన్నుల విధానంపై అధికారులతో చర్చించినట్టు తెలిసింది. ఉదయం 11 గంటలకు ప్రారంభమైన సమీక్ష.. మధ్యాహ్నం వరకు కొనసాగింది. అనంతరం సచివాలయంలో నిర్వహించిన మరో సమీక్షకు ఎక్సైజ్ ఉన్నతాధికారులు వెళ్లినట్టు తెలిసింది.

మల్లారెడ్డి కళాశాలకు అటానమస్

మేడ్చల్, జూలై 11 : మేడ్చల్ మున్సిపాలిటీ కిష్టాపూర్‌లోని మల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలకు అటానమస్ లభించింది. ఈ మేరకు స్వయం ప్రతిపత్తి కల్పిస్తున్నట్టు గురువారం యూజీసీ ప్రకటించింది. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ వేముల మల్లారెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ.. అటానమస్‌తో కళాశాలపై బాధ్యత మరింత పెరిగిందన్నారు.

జలసౌధలో తెలంగాణ ఇంజినీర్స్ డే

హైదరాబాద్, జూలై11 (నమస్తే తెలంగాణ): ప్రఖ్యాత ఇంజినీర్ ఆలీ నవాజ్ జంగ్ బహదూర్ జయంతిని పురస్కరించుకుని తెలంగాణ ఇంజినీర్స్ డే వేడుకలను ఎర్రమంజిల్‌లోని జలసౌధ కార్యాలయం, విద్యాసాగర్ భవన్‌లో గురువారం ఘనంగా నిర్వహించారు. జలసౌధ ప్రాంగణంలోని ఆలీ నవాజ్ జంగ్ బహదూర్ విగ్రహానికి ఈఎన్సీలు అనిల్‌కుమార్, నాగేందర్‌రావు, హరిరాం, చీఫ్ ఇంజినీర్లు, విశ్రాంత ఇంజినీర్ శ్రీధర్‌రావు దేశ్‌పాండే, తన్నీరు వెంకటేశం, ఎస్ఈలు పూలమాల వేశారు. ఖైరతాబాద్‌లోని ఇంజినీర్స్ ఇన్‌స్టిట్యూట్‌లో ఇంజినీర్స్ డే ఉత్సవాలను నిర్వహించి, పలువురు ఇంజినీర్లను సత్కరించారు. వాలంతరీ మాజీ డీజీ, నిట్ మాజీ డైరెక్టర్ పీజీ శాస్త్రీ, సాగునీటిశాఖ విశ్రాంత చీఫ్ ఇంజినీర్ చంద్రమౌళి, రోడ్డు, భవనాలశాఖ విశ్రాంత చీఫ్ ఇంజినీర్ జస్వంత్‌కుమార్, పంచాయతీరాజ్ విశ్రాంత చీఫ్ ఇంజినీర్ ఎంఏ కరీంను ప్రశంసాపత్రాలతో సత్కరించారు.

గృహహింసపై 12వేల జంటలకు కౌన్సెలింగ్

హైదరాబాద్, జూలై 11 (నమస్తే తెలంగాణ) : భరోసా సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ అండ్ ఎంపర్‌మెంట్ ఆఫ్ ఉమెన్ (సీడీఈడబ్ల్యూ) ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా 12,303 జంటలకు, 1,898 కుటుంబాలకు, 16,972 మంది వ్యక్తులకు గృహహింసపై కౌన్సెలింగ్ ఇచ్చినట్టు ఉమెన్ సేఫ్టీవింగ్ గురువారం ఎక్స్ వేదిక ద్వారా తెలిపింది. 2023 నుంచి ఇప్పటి వరకు 10వేల మంది బాధిత మహిళలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించినట్టు వెల్లడించింది. గృహహింస చట్టరీత్యా నేరమని, బాధితులు ఎవరైనా షీటీమ్స్ ద్వారా భరోసా సెంటర్లను ఆశ్రయించవచ్చని వెల్లడించింది.

మిగిలిన ఖాళీలకు ప్రమోషన్లు ఇవ్వాలి

పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్‌కు టీఆర్‌టీఎఫ్ వినతి

హైదరాబాద్, జూలై 11 (నమస్తే తెలంగాణ) : ఉపాధ్యాయ ప్రమోషన్లలో మిగిలిపోయిన ఖాళీలకు పదోన్నతులు కల్పించాలని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్‌కు తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్(టీఆర్‌టీఎఫ్)విజ్ఞప్తి చేసింది. గురువారం హైదరాబాద్‌లో ఆ శాఖ డైరెక్టర్ వెంకటనర్సింహారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కటకం రమేశ్, ప్రధాన కార్యదర్శి మారెడ్డి అంజిరెడ్డి, నాయకులు అశోక్ కుమార్, ప్రణీత్‌కుమార్ పాల్గొన్నారు.

తెల్లవార్లూ బదిలీల కౌన్సెలింగ్

హైదరాబాద్, జూలై 11 (నమస్తే తెలంగాణ) : సోషల్ వెల్ఫేర్ గురుకుల సొసైటీలో ఉద్యోగ, ఉపాధ్యాయుల బదిలీల కోసం బుధవారం మొదలైన కౌన్సెలింగ్ గురువారం ఉదయం 11:30 గంటల వరకు కొనసాగింది. గ్రేడ్-2 ప్రిన్సిపాళ్లు, డిగ్రీ కాలేజీ స్టాఫ్ మినహాయించి మిగతా అన్ని కేడర్లలో అవసరానికి మించి 317 జీవోఫలితంగా డిస్ లొకేటైన ఉద్యోగ, ఉపాధ్యాయులను కౌన్సెలింగ్‌కు ఆహ్వానించారు. వేకెన్సీ లిస్టులో తప్పులున్నాయని, అర్జెజింగ్ వెకెన్సీలు చూపడం లేదని, స్పౌజ్‌ను పరిగణలోకి తీసుకోవడం లేదని అభ్యంతరాలు వ్యక్తమవడంతో కౌన్సెలింగ్‌లో జాప్యం జరిగింది. రాత్రి 10:30 గంటలకు తిరిగి ప్రారంభమై గురువారం ఉదయం 11:30 వరకు కొనసాగింది. షెడ్యూల్ ప్రకారం గురువారం జేఎల్, పీజీటీ కౌన్సెలింగ్ నిర్వహించాల్సి ఉంది. ఆ ప్రక్రియ ప్రారంభించకుండానే కౌన్సెలింగ్‌తో అలిసిపోయామని పేర్కొంటూ శుక్రవారానికి వాయిదా వేశారు. సమాచారం తెలియని ఉపాధ్యాయులు అసహనం వ్యక్తం చేశారు.

'గిరిజన' బదిలీలకు మార్గదర్శకాలు..

గిరిజన సంక్షేమ శాఖలో పని చేస్తున్న ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులకు సంబంధించి ఆ శాఖ గురువారం జీవో-17తోపాటు షెడ్యూల్‌ను విడుదల చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 3,700 మంది ఉపాధ్యాయులకు ఇది వర్తించనున్నది. షెడ్యూల్ ప్రకారం శుక్రవారం నుంచి బదిలీ ప్రక్రియను ఆన్‌లైన్‌లో వెబ్ కౌన్సెలింగ్ ద్వారా నిర్వహించనున్నారు.

పాఠశాల విద్య డైరెక్టర్‌తో ఎమ్మెల్సీ ఏవీఎన్ భేటీ

హైదరాబాద్, జూలై 11 (నమస్తే తెలంగాణ) : పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ వెంకటనర్సింహారెడ్డితో ఎమ్మెల్సీ ఏవీ నర్సింహారెడ్డి గురువారం సమావేశమై టీచర్ల బదిలీల సమస్యలను పరిష్కరించాలని కోరారు. పాఠశాల విద్యాశాఖలో పదోన్నతుల తర్వాత మిగిలిన ఖాళీలకు వెంటనే పదోన్నతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. పలు సమస్యలతో కూడిన వినతిప్రతం సమర్పించారు.

'జీవో 317' ప్రభావిత ఉద్యోగులకు ఊరట

హైదరాబాద్, జూలై 11 (నమస్తే తెలంగాణ): 'జీవో 317' ప్రభావిత ఉద్యోగుల్లో కొందరికి క్యాబినెట్ సబ్ కమిటీ ఊరట కలిగించింది. మంత్రి దామోదర నేతృత్వంలోని మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌తో కూడిన కమిటీ గురువారం సచివాయలంలో సమావేశమై దరఖాస్తులను పరిశీలించింది. స్పౌజ్, మెడికల్, మ్యూచువల్, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు చేసుకున్న దరఖాస్తులను సంబంధిత శాఖాధిపతులకు పంపాలని జీఏడీ అధికారులను ఆదేశించింది. డీఎస్సీ 2008 అభ్యర్థులకు ఉద్యోగా లిచ్చే అంశంపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఈ నెల 18న కమిటీ మరోసారి భేటీ కానున్నది. రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి రఘునందన్‌రావు, పీఆర్సీ చైర్మన్ శివశంకర్ పాల్గొన్నారు.

మా కన్నా ప్రత్యర్థులే బలవంతులు!

- అందుకే ఓడిపోయాం.. మాతప్పేంలేదు
- కురియన్ కమిటీకి ఓడిన ఎంపీ అభ్యర్థుల వివరణ

హైదరాబాద్, జూలై 11 (నమస్తే తెలంగాణ): 'అధికారం ఉండగా ఎంపీ ఎన్నికల్లో పార్టీ ఎందుకు విఫలమైంది. మీరంతా ఎందుకు ఓడిపోయారు? అంటూ లోక్‌సభ ఎన్నికల్లో ఓడిపోయిన కాంగ్రెస్ అభ్యర్థులను కురియన్ కమిటీ ప్రశ్నించింది. ఈ ప్రశ్నలకు అభ్యర్థులు ఇచ్చిన సమాధానం కమిటీ సభ్యులను విస్మయపరిచినట్టు తెలిసింది. 'మా కన్నా, మన పార్టీ కన్నా ప్రత్యర్థ పార్టీ అభ్యర్థి బలంగా ఉన్నారు. రాజకీయ ప్రత్యర్థులు కలిసిపోవడంతో వాళ్లను ఎదుర్కోలేకపోయాం' అంటూ పలువురు సమాధానం చెప్పినట్టు సమాచారం. సొంత పార్టీ నేతలు, కార్యకర్తల నుంచి సహకారం అందలేదని, తమకు వ్యతిరేకంగా పని చేశారని, నిధుల కొరత ఏర్పడిందని అందుకే ఓడిపోయామని చెప్పినట్టు తెలిసింది. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పటికీ ఏమాత్రం ప్రభావంలేని బీజేపీతో సమానంగా 8 సీట్లు గెలుపొందడాన్ని పార్టీ అధిష్ఠానం సీరియస్‌గా తీసుకుంది. రాష్ట్రంలో కనీసం 12 సీట్లు గెలవాలని కాంగ్రెస్ లక్ష్యంగా పెట్టుకున్నది. ఈ వైఫల్యంపై పోస్ట్ మార్టం చేసేందుకు నియమించిన కురియన్ కమిటీ గురువారం గాంధీభవన్‌లో గెలిచిన, ఓడిన ఎంపీ అభ్యర్థులతో సమావేశమైంది. పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ మినహా మిగిలిన 16 మంది హాజరయ్యారు. లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలోని ఎమ్మెల్యేలతో శుక్రవారం సమావేశమై నివేదిక అందించనుంది.

ఆ రెండింటిపై ఆగ్రహం

జీహెచ్ఎంసీ పరిధిలో ఒక్క ఎంపీ సీటు కూడా గెలుచుకోకపోవడంపై కురియన్ కమిటీ ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. గెలిచేందుకు అవకాశం ఉన్న ఆదిలాబాద్, మల్కాజిగిరి, సికింద్రాబాద్, చేవెళ్ల, మెదక్ స్థానాల్లో ఓడటంపై ప్రశ్నలు సంధించినట్టు చెప్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహించిన, సిట్టింగ్ స్థానం మల్కాజిగిరిలో ఓడిపోవడంపై కమిటీ ఆశ్చర్యం వ్యక్తం చేసినట్టు సమాచారం. అక్కడ కాంగ్రెస్ అభ్యర్థి సునీతా మహేందర్ రెడ్డి కనీసం పోటీ కూడా ఇవ్వలేకపోయారని ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది.

సొంత పార్టీ నేతలే ఓడించారు

సొంత పార్టీ ఎమ్మెల్యేలు, నేతలే తమను ఓడించారని ఎంపీ అభ్యర్థులు కమిటీకి చెప్పినట్టు సమాచారం. ఆశించిన స్థాయిలో ఆర్థిక మద్దతు లభించలేదని, నిధుల కొరతతో ఓడామని మరికొందరు చెప్పినట్టు తెలిసింది.

మీరంతా మాట్లాడుకున్నారా?

కురియన్ కమిటీ ముందు హాజరైన ఓటమిపాలైన అభ్యర్థులు అందరూ ఒకే రకమైన సమాధానాలు చెప్పడం పట్ల కురియన్ కమిటీ సభ్యులు ఒక్కింత అసహనం వ్యక్తం చేసినట్టు తెలిసింది. 'ఎవరి బడీ టెల్లింగ్ సేమ్ స్టోరీ' పెదవి విరిచినట్టు సమాచారం. మమ్మల్ని కలువడానికి ముందు మీరంతా ఒకేరకంగా చెప్పాలని ఏమైనా మాట్లాడుకున్నారా? అనే అనుమానాన్ని కూడా కమిటీ సభ్యులు వ్యక్తం చేసినట్టు తెలిసింది. ఇలా అయితే ఫ్యాక్ట్స్ ఎలా బయటికోస్తాయని కూడా వారు ఎదురు ప్రశ్నించినట్టు సమాచారం.

సీఎం రేవంత్‌రెడ్డి కృషి ఆమోఘం

'సీఎం రేవంత్‌రెడ్డి మా విజయం కోసం ఎంతో కష్టపడ్డారు. మమ్మల్ని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ, దిశా నిర్దేశం చేశారు. ఇన్‌చార్జి మంత్రులు ప్రచారం ముగిసేవరకు చిత్తశుద్ధితో పని చేశారు. అయినప్పటికీ కొన్ని చోట్ల బీజేపీ వేవ్, బీఆర్ఎస్ అభ్యర్థులు వారితో చేతులు కలుపడం వల్లనే విజయం సాధించలేకపోయాం' అని కురియన్ కమిటీ ఎదుట హాజరైన అంతా ఒకే రకంగా చెప్పినట్టు తెలిసింది. నిజానిర్ధారణ కమిటీ సభ్యులతో పాటు అక్కడ పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్, ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్ ఒకరి తర్వాత ఒకరు అక్కడే ఉండటం వల్ల కొన్ని వాస్తవాలు చెప్పలేకపోయినట్టు ఓడిపోయిన ఒక అభ్యర్థి వాపోయారు.

ఐపీఎస్‌లకు స్థానచలనం

హైదరాబాద్, జూలై 11 (నమస్తే తెలంగాణ) : పలువురు ఐపీఎస్‌లను ప్రభుత్వం బదిలీ చేసింది. డీజీపీ (సమన్వయం)గా జితేందర్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీచేయడంతో పాటు డీజీపీ (హెడ్ ఆఫ్ ది ఫోర్స్)గా అదనపు బాధ్యతలు అప్పగించింది. ఇప్పటివరకు డీజీపీగా పనిచేసిన రవి గుప్తాను హోంశాఖ ముఖ్యకార్యదర్శిగా నియమించింది. మరోవైపు అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) డైరెక్టర్ జనరల్ సీవీ ఆనంద్‌కు ఇన్నాళ్లూ జితేందర్ పర్యవేక్షించిన విజిలెన్స్ అండ్ ఎన్‌పోర్స్‌మెంట్ డైరెక్టర్ జనరల్ విభాగం పూర్తిస్థాయి బాధ్యతలు అప్పగించింది.

ఐపీఎస్ అధికారి	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
మహేశ్ భగవత్	అదనపు డీజీపీ (రైల్వేస్ అండ్ రోడ్ సేఫ్టీ)	అదనపు డీజీపీ (శాంతిభద్రతలు)
సంజయ్‌కుమార్ జైన్	అదనపు డీజీపీ (శాంతిభద్రతలు)	అదనపు డీజీపీ (టీజీఎస్‌పీ బెటాలియన్స్)
స్వాతిలక్రా	అదనపు డీజీపీ (టీజీఎస్‌పీ బెటాలియన్స్)	అదనపు డీజీపీ (ఆర్గనైజేషన్ అండ్ హోంగార్డ్స్)
స్టీఫెన్ రవీంద్ర	అదనపు డీజీపీ (హోంగార్డ్స్)	అదనపు డీజీపీ (గ్రేహౌండ్స్ అండ్ అక్టోపస్)
విజయ్‌కుమార్	అదనపు డీజీపీ (గ్రేహౌండ్స్ అండ్ అక్టోపస్)	అదనపు డీజీపీ (పర్సనల్, వెల్ఫేర్, స్పోర్ట్స్)
జీ సుధీర్‌బాబు	ఐజీపీ మల్టీజోన్-2	రాచకొండ కమిషనర్
కే రమేశ్‌నాయుడు	వెయిటింగ్	ఐజీపీ (రైల్వేస్ అండ్ రోడ్ సేఫ్టీ)
వీ సత్యనారాయణ	సంయుక్త కమిషనర్ (హైదరాబాద్ కార్ హెడ్‌క్వార్టర్స్)	ఐజీపీ మల్టీజోన్-2
తరుణ్‌జోషి	రాచకొండ కమిషనర్	ఏసీబీ డైరెక్టర్
చంద్రశేఖర్‌రెడ్డి	ఐజీపీ (పర్సనల్)	ఐజీపీ మల్టీజోన్-1
రక్షిత కే మూర్తి	వనపర్తి ఎస్పీ	డీసీపీ (హైదరాబాద్ కార్ హెడ్‌క్వార్టర్స్)
ఉదయ్‌కుమార్‌రెడ్డి	హైదరాబాద్ సౌత్‌వెస్ట్ డీసీపీ	మెదక్ ఎస్పీ
బాలస్వామి	మెదక్ ఎస్పీ	హైదరాబాద్ ఈస్ట్ జోన్ డీసీపీ
ఆర్ గిరిధర్	హైదరాబాద్ ఈస్ట్‌జోన్ డీసీపీ	వనపర్తి ఎస్పీ
చంద్రమోహన్	రాచకొండ టాస్క్‌ఫోర్స్ డీసీపీ	హైదరాబాద్ సౌత్‌వెస్ట్ జోన్ డీసీపీ

సీఎం బంధువులకే కాంట్రాక్టులు

- తమ్ముడు, బావమరిది కంపెనీలకు లబ్ధి
- రూ. 3 వేల కోట్ల కాంట్రాక్టును ముగ్గురికి సమానంగా పంచేశారు
- చీకటి జీవోలపై విచారణ చేయాలి
- బీజేపీఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

హైదరాబాద్, జూలై 11 (నమస్తే తెలంగాణ): చీకటి ఒప్పందాలు, చీకటి జీవోలతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోయిందని బీజేపీ ఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి విమర్శించారు. గురువారం ఆయన అసెంబ్లీ వద్ద మీడియాతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వానికి చెందిన అమృత్ పథకం కింద రూ.3 వేల కోట్ల పనుల్లో భారీ కుంభకోణం జరిగిందని, ఈ పనులను మూడు భాగాలుగా విభజించి ఒక్కొక్కరికి రూ.వెయ్యి కోట్లు చొప్పున ఇచ్చారని ఆరోపించారు. ఎక్సైజ్ కుంభకోణంలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి బావమరిది సృజన్‌కు చెందిన శోధ కంపెనీకి రూ.400 కోట్ల కాంట్రాక్ట్ ఇచ్చారని, దానికి అర్హత లేకపోవడంతో ఏఎంఆర్‌తో జాయింట్ వెంచర్‌గా జత కట్టారని తెలిపారు. కేఎన్ఆర్ అనే కంపెనీకి మరో కాంట్రాక్ట్ ఇచ్చారని, సీఎం తమ్ముడు తిరుపతిరెడ్డి ఇందులో భాగస్వామి అని చెప్తున్నారని పేర్కొన్నారు. మేఘా కంపెనీకి రూ.1100 కోట్ల కాంట్రాక్ట్ దక్కిందని చెప్పారు. ఇవి గ్లోబల్ టెండర్లు కావని, సంబంధిత టెండర్లు ఆన్‌లైన్‌లో కనిపించవని, ఏజీవో కూడా పబ్లిక్ డొమైన్‌లో లేదని వివరించారు. రూ.600 కోట్లతో పూర్తయ్యే ప్రాజెక్ట్‌ను రూ.1000 కోట్లకు ఇచ్చినట్టు ఆరోపించారు. 30 నుంచి 35 శాతం తక్కువకు పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. దీనిని బట్టి దాదాపు రూ.1200 కోట్ల కుంభకోణం జరిగిందని ఆరోపించారు. మేఘా కృష్ణారెడ్డి మీద కాళేశ్వరం కమిషన్ విచారణ జరుగుతున్న సమయంలో కొత్త టెండర్లు ఎలా కట్టబెడతారని ప్రశ్నించారు. వీటిపై రేవంత్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గతంలో కేసీఆర్‌ను కుటుంబ పాలన అంటూ విమర్శించిన రేవంత్ ఇప్పుడు తన కుటుంబ సభ్యులకు కాంట్రాక్టులు ఎలా కట్టబెడతారని ప్రశ్నించారు. రేవంత్ ఏడు నెలల పాలనలోని చీకటి జీవోలపై ఈడీ, సీబీఐలతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

ప్రజాతీర్పును అగౌరవపరుస్తున్న సీఎం

- బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్

హైదరాబాద్, జూలై 11 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రజలు రుణమాఫీ, రైతుభరోసా హామీలను నమ్మి ఓటేశారని, ఇప్పుడు ప్రజాభిప్రాయం కోసం కమిటీలు వేయడమంటే ప్రజాతీర్పును అగౌరవపర్చడమేనని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ మండిపడ్డారు. గురువారం ఆయన బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. రాష్ట